క్లుప్తంగా

అమరగాయకుడు ఘంటసాల



శతాబ్ది గాయకుడు ఘంటసాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అద్దంకి: సినీ పాటల ప్రస్థానంలో ఘంటసాల అమరగాయకుడిగా నిలిచిపోయాడని ఘంటసాల గానభారతి సంస్థ అధ్యక్షుడు మోటుపల్లి రామదాసు అన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా సోమవారం ఘంటసాల గానభారతి ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి ఎదురుగా ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ సినిమా పాటకు ఒక చరిత్రను కల్పించిన ఘనత ఘంటసాలకే దక్కుతుందన్నారు. పండితుల నుంచి పామరుల వరకు ఘంటసాల పాట వారి నోట వినిపిస్తుందన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు మాట్లాడుతూ ఘంటసాల స్వరంలో కూర్చిన ప్రతి పాట సుమధుర గీతమన్నారు. ఆయన పాటలు స్వర, అక్షర శబ్ద ప్రధానంగా ఉంటాయని చెప్పారు. అందుకే ఆయన ఈ శతాబ్ది గాయకుడిగా పేరు గాంచాడని చెప్పారు. ఆర్‌వీ రాఘవరావు మాట్లాడుతూ తెలుగు సినీ పాటకు ఘంటసాల వల్ల అమరత్వం కలిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ బాలు, గోగులమూడి శేషగిరిరావు, బత్తుల అంజయ్య, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, షేక్ మస్తాన్, కూరపాటి రామకోటేశ్వరరావు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

సభ్యులకు అండగా వాసవీ క్లబ్

అద్దంకి రూరల్: ఎల్లప్పుడూ సభ్యులకు అండగా వాసవీ క్లబ్ ఉంటుందని వాసవీ క్లబ్ సభ్యులు తెలిపారు. వాసవీక్లబ్ సభ్యుడు చామర్తి వెంకట సుబ్బారావు ఇటీవల మరణించాడు. వాసవీ కుటుంబ సురక్ష పథకంలో మృతుడి భార్యకు రూ.3. 20 లక్షల చెక్కును క్లబ్ కేబినెట్ బృందం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, గ్రంధి లక్ష్మీ నాగరాజ కుమారి, బైసాని సుజాత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



వికసిత్ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై గ్రామ పంచాయతీల వారీగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో బ్రహ్మయ్య కోరారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో వికసిత్ భారత్–సంకల్పయాత్రకు నోడల్ అధికారుల ఎంపికతో షెడ్యూల్ ప్రకటించారు. ఈ నెల 7 నుంచి 17 వరకు జరిగే వికసిత్ భారత్ యాత్రలో పీఎం కిసాన్, నానో ఎరువులు, భూసార పరీక్షలు, కిసాన్ క్రెడిట్ కార్డులు జల్‌జీవన్ మిషన్, బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాలపై వాహనం ద్వారా లబ్ధిదారులకు వివరించాలన్నారు. మిచాంగ్ తుఫాన్ తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కోరారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుచేయాలి

చీరాల రూరల్: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు–2023 రద్దుచేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా సోమవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే యాక్టును రద్దు చేయాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం పుబ్బ నక్షత్రం అష్టమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

ఆడుదాం ఆంధ్రాకు నమోదు చేయాలి

బేస్తవారిపేట: ఏపీలో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమంలో ఆటల్లో పాల్గొనే వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ టి.పార్వతి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడేందుకు అవసరమైన అన్ని క్రీడా పరికరాలు అందిస్తారని, సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టోర్నమెంట్ నిర్వహిస్తారని చెప్పారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఈఓపీఆర్డీ రామాంజనేయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తుఫాన్‌కు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తీర ప్రాంత ప్రజలు షెల్టర్లకు తరలి వెళ్లాలి
- జాయింట్ కలెక్టర్ శ్రీధర్



పల్లెపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

చినగంజాం: తీర ప్రాంత గ్రామాల ప్రజలు మిచాంగ్ తుఫాన్ దృష్ట్యా తుఫాన్ షెల్టర్లకు తరలి వెళ్లాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అన్నారు. మిచాంగ్ తుఫాన్ దృష్ట్యా సోమవారం ఆయన మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన పల్లెపాలెం గ్రామాన్ని సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. తుఫాన్ ఉధృతి దృష్ట్యా తీరంలో గ్రామాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉన్న దృష్ట్యా , ప్రజలు అధికారులకు సహకరించి షెల్టర్‌లకు తరలి వెళ్లాలని సూచించారు. అధికారులు ప్రజలను సకాలంలో పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. చీరాల ఆర్డీఓ పీ సరోజిని మండలంలోని పెదగంజాం పల్లెపాలెం సందర్శించి తీర ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీ పార్వతి, ఎస్సై కే సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. చీరాల వాడరేవు, వేటపాలెం తీర ప్రాంత గ్రామాలను ఆయన సందర్శించారు. అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాడరేవులో సముద్రం ముందుకు రావడంతో ప్రజలు భయాందోళన చెందాడు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన..

కారంచేడు: తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, పోలీసు, వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలతో కారంచేడు ప్రాంత అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 5,6 తేదీల్లో తుఫాను కారణంగా పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. పంట చేతికందే తరుణంలో వస్తున్న ఈ తుఫానును చూసి మేము ఎక్కడికి వెళ్లాలని రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కొమ్మమూరు ఆయకట్టు కింద కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చినగంజాం వంటి మండలాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు అయ్యింది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవక వరి సాగు ఆలస్యం అయ్యింది. దీంతో ప్రస్తుతం వరి చేలు పొట్ట దశలో ఉన్నాయని, ఇప్పుడు తుఫాను ప్రభావంతో వర్షాలు కురిస్తే పెట్టిన పెట్టుబడులు నీటిలో పోసిన పన్నీరుగానే అవుతుందని వారు వాపోతున్నారు. భగవంతుడిపైన ఆశపెట్టుకోవడం తప్ప, చేసేదేమీ లేదని వారు ఆందోళన చెందుతున్నారు. సోమవారం పెద్దగా వర్షం కురవలేదని, మంగళ, బుధవారాల్లో కురిసే వర్షాలపైనే మా జాతకం ఆధారపడి ఉందని రైతులు చెప్తున్నారు.

తుఫాన్‌తో చిరుజల్లులు, చలి..

బల్లికురవ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సోమవారం బల్లికురవ మండలంలో చిరుజల్లులతో పాటు ఈదురుగాలులు, చలి తీవ్రత పెరిగింది. వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి మూడు రోజులుగా అప్రమత్తత చేశారు. చేతికి వచ్చిన ప్రత్తి పంటను తీసుకోవటంతోపాటు బోర్లకింద సాగుచేసిన వరి కోతకు రాగ అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాల్లో మూడు రోజులు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. తహశీల్దార్ కె. రవిబాబు గ్రామాల వారీగా వీఆర్‌వోలను అప్రమత్తతతో పాటు అందుబాటులో ఉండేలా ఆదేశించారు.



దేశాయిపేట-నీలకంఠాపురం రహదారిపై విరిగిపడిన చెట్టు



పెదగంజాం పల్లిపాలెం గ్రామంలో తుఫాన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని



వాడరేవులో ముందుకువచ్చి ఉధృతంగా ఉన్న సముద్రం



దేగరమూడి చప్టా వద్ద కాపలా కాస్తున్న పోలీసులు

లోతట్టు ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు



కుంకలమర్రు తుఫాన్ షెల్టర్‌లో ప్రజలు, అధికారులు



వాడరేవులో తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ ప్రభాకర్‌రావు

కారంచేడు: లోతట్టు ప్రాంత ప్రజలను అందుబాటులో ఉన్న పునారావాస కేంద్రాలను తరలించే కార్యక్రమాన్ని చేపట్టినట్టు మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా సహకారశాఖ అధికారి కేవీ రామారావు, ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణలు అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రమైన కారంచేడు, కుంకలమర్రు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలను తరలించారు. కారంచేడులో యూపీ పాఠశాల, గ్రామ సచివాలయం–1, వైఎస్ఓ ఉన్నత పాఠశాల వద్ద సుమారు 65 కుటుంబాలను, కుంకలమర్రు తుఫాను షెల్టర్‌లో గ్రామానికి చెందిన ఎస్టీలలో సుమారు 40 కుటుంబాలను తరిలించి వారికి అవసరమైన సదుపాయాలు, ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, ఐకేపీ ఏపీఎం మధుసూధనరావు, కే అంజయ్య, షేక్ ఖాశీం, సిబ్బంది పాల్గొన్నారు.



అద్దంకి: మణికేశ్వరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



చినఅంబడిపూడి శివాలయంలో భక్తుల కోలాహలం

కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

బల్లికురవ/అద్దంకి: కార్తీక మాసంలో శివాలయంలో దీపం పెట్టిన వారికి సకల పాపాలు తొలుగుతాయని కార్తీక పురాణంలో చెప్పబడిందని భక్తుల నమ్మకం. దాంతో కార్తీక మూడో సోమవారం జిల్లాలోని ప్రముఖ శివ స్వయంభు క్షేత్రం అద్దంకిలోని మణికేశ్వరానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆలయానికి పడమర వైపున్న గుండ్లకమ్మ నదిలో పుణ్యస్నానాలు చేసి, ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. తరువాత స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

■ కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా బల్లికురవ మండలంలోని శివాలయాల్లో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. చిన అంబడిపూడి, గంగాపార్వతీదేవి సమేత మల్లేశ్వరస్వామి, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు, కొణిదెన, వేమవరం, కొండాయపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు శివాలయాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు ఆలయాలకు వెళ్లి వత్తులు వెలిగించుకుని స్వామి అమ్మవార్లకు జరిగిన అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

కారంచేడు: కార్తీకమాసం మూడో సోమవారం వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారం శివునికి ప్రీతికరమైన రోజుగాను, ఈ రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తే కుటుంబం సంతోషంగా సుఖ, సంతోషాలతో ఉంటుందని భక్తుల విశ్వాసం. దీంతో కారంచేడు కట్టుమల్లేశ్వరస్వామి వారి ఆలయం, పెద బజారు శివాలయం, గంగమ్మ గుడి, సాయిమందిరం, స్వర్ణ శివాలయం, వల్లభరాయరాయస్వామివారి గుడి, వెంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లోను భక్తులు వేకువ జామున ఆలయంలో స్వామివార్లకు దీపారాధనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.



కారంచేడు గంగమ్మ గుడిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, నైవేద్యాలు

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మార్కాపురం: తుఫాన్ నేపథ్యంలో పంటలు రక్షించుకునేందుకు రైతులు తగిన జాగత్తలు పాటించాలని మార్కాపురం సబ్‌డివిజన్ ఏడీఏ రమాదేవి సూచించారు. వరి గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉన్నట్లయితే వెంటనే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్, పాలిథిన్ పట్టలతో కప్పాలని తెలిపారు. వరి పనలు చేలో ఉంటే తక్షణమే కట్టలు కట్టి తడవకుండా చూసుకోవాలన్నారు. తడిచిన పనల్లో మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, మిరపలో వర్షం నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మూడో తీతకు సిద్ధంగా ఉన్న పత్తిని వెంటనే కూలీలతో తీయించి భద్రపరుచుకోవాలని ఏడీఏ స్పష్టం చేశారు.

శభాష్ వలంటీర్



ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ దరియాబి

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి గుండె సంబంధిత చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వలంటీర్ షేక్ దరియాబి గుంటూరు వెళ్లి చికిత్స పొందుతున్న మస్తాన్‌వలికి పింఛన్ అందజేసింది. సుమారు 60 కిలోమీటర్ల దూరం వెళ్లి పింఛన్ అందజేయటంపై వలంటీర్ దరియాబిని గ్రామస్తులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

ఒంగోలు మెట్రో: స్థానిక కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు మండపాల్లో 18 కలశాలతో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ చేశారు.

విద్యార్థినులను జాగ్రత్తగా చూసుకోవాలి

రాచర్ల: విద్యార్థినులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీవో కె.కవితాచౌదరి అన్నారు. మండల కేంద్రం రాచర్ల కస్తూరిబా బాలికల పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ తీవ్రరూపంగా మారుతుందని, ఎక్కువగా చలితో పాటు తీవ్ర గాలులను దృష్టిలో పెట్టుకుని వసతి గృహాల్లో అప్పుడే వండిన వేడి వేడి ఆహారాన్ని వడ్డించాలని ఎస్‌వో మాలకొండమ్మను ఆదేశించారు. రాత్రి సమయాల్లో విద్యార్థినులు నిద్రించే గదులను అప్పుడప్పుడూ పర్యవేక్షించాలన్నారు. అనంతరం భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎంఈవో గిరిధర్‌శర్మ ఉన్నారు.

బాల్య వివాహ రహిత గ్రామాలను తీర్చిదిద్దాలి

వజ్జిరెడ్డిపాలెం (కొత్తపట్నం): బాల్య వివాహ రహిత గ్రామాలను తీర్చిదిద్దాలని వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి పిలుపునిచ్చారు. జండర్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాల్య వివాహాలపై సర్పంచ్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడానికి చేసిన ఉద్యమాల గురించి వివరించారు. బాలబాలికలకు 21 సంవత్సరాలు దాటిన తర్వాత వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరిపితే కుటుంబాలు ఆరోగ్యంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్ శివపార్వతి, ఏపీఎం రజియాసుల్తానాబేగం, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

బల్లికురవ: అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని బాపట్ల జిల్లా రైతు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య అన్నారు. సోమవారం మండలంలోని నక్కబొక్కలపాడు సచివాలయంలో పార్టీ జెండా, డిస్ ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రపంచ దేశాల్లోనే నెంబర్‌వన్ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారన్నారు. రాబోయో ఎన్నికల్లో కూడా అండదండలతో ఆశీర్వదించి రెండోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేరయ్య అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, ఎంపీడీవో బ్రహ్మయ్య, సర్పంచ్ దూళిపాళ్ల రామయ్య, జేసీఎస్ అధ్యక్షుడు టి. నరేష్, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, షేక్ శ్రీనువలి, సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నక్కబొక్కలపాడులో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న పేరయ్య

నిబద్ధత కలిగిన నాయకుడు రోశయ్య



రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్

అద్దంకి: నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన రోశయ్య వర్ధంతి కార్యక్రమనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విగ్రహానికి పూమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా చైతన్య మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి కుడి భుజంలాగా రోశయ్య పనిచేశారన్నారు. ఆయన ఆర్థిక మంత్రిగా రాష్ట్రానికి అందించిన సేవలు మరులేవనివని చెప్పారు. ప్రతిపక్షాన్ని సునిశితంగా లోతుగా ఆధారాలతో విమర్శించడంలో దిట్ట అన్నారు. ఆయన బాటలో నేటి రాజకీయ నాయకులు నడవాల్సిన అవసరం ఉందన్నరు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘ నాయకుడు కే రామకోటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కౌన్సిరల్లు గుంజి కోటేశ్వరరావు, వార్డు ఇన్‌చార్జులు, ఆర్యవైశ్య నాయకులు, పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్యకు నివాళులు..

చీరాల అర్బన్: తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం చీరాలలో నిర్వహించారు. స్థానిక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ వద్ద గల కొణిజేటి రోశయ్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఎంజీసీ మార్కెట్ డెవలప్‌మెంట్ కమిటి అధ్యక్షులు వేముల చంద్రశేఖరరావు, కార్యదర్శి తాతా కుమారస్వామి పలువురు పూలమాలలు వేశారు. కొణిజేటి రోశయ్యకు నియోజకవర్గానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. చీరాలలో ఆయన ఎమ్మెల్యేగా, ఆర్థిక మంత్రిగా పనిచేశారన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చీరాల ప్రాంత అభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీటీ ఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు శీరాం వేణుగోపాల్, కోట శ్రీమన్నారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని లీలాధరరావు, తులాబంధుల సురేష్‌కుమార్, కౌన్సిలర్లు పొత్తూరి సుబ్బయ్య, గుంటూరు ప్రభాకరరావు, చీమకుర్తి బాలకృష్ణ, మామిడాల రాములు, చేబ్రోలు బాబాజీ, నేతాజీ సేవా సమితి అధ్యక్షులు చుండూరి కృష్ణమూర్తి, మంచికంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చీరాలలో రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అతిథులు

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

చీరాల: తుఫాను నేపథ్యంలో వీస్తున్న చలిగాలలు, వర్షంలో చెట్టు కింద అచేతనంగా పడి అవస్థ పడుతున్న వృద్ధుడిని సోమవారం చీరాల ఒన్‌టౌన్ పోలీసులు కాపాడి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చీరాల రైల్వేస్టేషన్ సమీపంలోని సైకిల్ స్టాండ్ వద్ద చెట్టుకు శరీరంపై వస్త్రాలు కూడా లేకుండా చలికి వణికిపోతూ వర్షంలో తడిపోతున్న వృద్ధుడిని చూసిన రైల్వేస్టేషన్ మాస్టర్ కాల్ సెంటర్ 112, 108 కు సమాచారం అందించారు. ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రక్షక్ మొబైల్ ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ కె.వీరాస్వామి, డ్రైవర్ కానిస్టేబుల్ బ్రహ్మయ్యలు స్పందించి ఆ వృద్ధుడికి పంచె, ఆహారం, రెయిన్ కోట్ అందించి 108 అంబులెన్స్‌లో ఎక్కించి చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ప్రస్తుతం అతడు సురక్షితంగా ఉన్నాడన్నారు. వృద్ధుడి అవస్థను చూసి మానవతా దృక్పథంతో స్పందించి తక్షణ సహాయం అందించిన రక్షక్ సిబ్బందిని అందరూ అభినందించారు.



వృద్ధుడికి సహాయం అందిస్తున్న రక్షక్ సిబ్బంది

వైభవంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

యద్దనపూడి: 41 రోజుల పాటు అయ్యప్పస్వామి కఠోరదీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులు ఇరుముడి కార్యక్రమాన్ని వైభవంగా పూర్తిచేసుకున్నారు. మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో గురుస్వామి ఆదిమూర్తి ఆధ్వర్యంలో అయ్యప్పభక్తులు ఇరుముడి కట్టించుకున్నారు. అనంతరం శబరిమల యాత్ర అనుమతి కోరుతూ గ్రామదేవతలను దర్శించుకొని గ్రామంలో శరణుగోషలు చెప్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలు మొత్తం బంధువులతో, భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



ఇరుముడి కట్టుకొని శబరిమలై యాత్రకు వెళ్తున్న అయ్యప్పస్వాములు